



అర్ధగిరి కొండపై బోల్తాపడిన ట్రాక్టర్, మృతి చెందిన డ్రైవర్ బాలాజీ

# ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి

## ఐదు మందికి తీవ్రగాయాలు

తవణంపల్లె, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

స్వామి దర్శనానికి వెళ్ళి తిరిగి వస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్ నడుపుతున్న యువకుడు అక్కడిక్కడే మృతి చెందగా మరో ఐదు మందికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం మండలంలోని అరగొండ అర్ధగిరి కొండపై జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు బంగారుపాళ్యం మండలం నల్లంగాడు జవుకుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి తన కుమారుడు పుట్టిన సందర్భంగా కుటుంబసభ్యులు, బంధువులతో కలసి సుమారు 10 మంది ట్రాక్టర్‌లో గురువారం మధ్యాహ్నం అర్ధగిరి స్వామివారి దర్శనానికి వచ్చారు. స్వామివారి దర్శనానంతరం వీరు తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా నడపడంతో కొండపై మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీనితో ట్రాక్టర్ నడుపుతున్న బాలాజీ(19) ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడే మృతి చెందాడు. అలాగే ట్రాక్టర్ ట్రాలీలో వున్న సుజాత, సాయి, కోదండ, కుమారిలకు తీవ్రగాయాలయ్యాయి. అలాగే మరో ఐదు మందికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





# అర్హత వున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు

## భారత సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్



భారత డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్, డిఆర్‌ఓ రాజశేఖర్‌లు.

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

అర్హత వున్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ నితీష్‌కుమార్ వ్యాస్ అధికారులను ఆదేశించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ నుండి భారత డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ నితీష్‌కుమార్ వ్యాస్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2023పై గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో భారత డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ మాట్లాడుతూ 17-18, 18-19 వయస్సు వున్న కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు లభించేలా క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో చిత్తూరు కలెక్టరేట్ నుండి హాజరైన కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ 74.60 శాతం పూర్తి చేశామని, ఫారం-6 పెండెన్సీపై దృష్టి కేంద్రీకరించి క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు కోసం పోలింగ్ స్టేషన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జగనన్న విద్యాదీవెన కింద లబ్ధిపొందిన విద్యార్థులు ఓటర్లుగా నమోదు అయ్యారా! లేదా! పరిశీలిస్తున్నామన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో సైతం కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే వలస వెళ్ళిన వారు, మృతి చెందిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, పుంగనూరు, జిడినెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఈఆర్‌ఓలు ప్రభాకర్‌రెడ్డి, భావానీ, డాక్టర్ రేణుకలు, పూతలపట్టు నియోజకవర్గ ఈఆర్‌ఓ పర్వీన్, ఎలక్షన్ విభాగం డిటి పార్థసారధి, సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది

## ముఖ్యమంత్రి వినూత్న ఆలోచనతో వ్యవసాయ రంగంలో కీలక మార్పులు

## ఉద్యాన పంటలలో ఏడాది ఒక్కో పరిశోధన అభినందనీయం : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



తిరుపతిరూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో చీని, నిమ్మ పరిశోధన స్థానం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2021-22 స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కాకాని మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏడాదికి ఓ ఉద్యాన పంటపై పరిశోధన చేసి, ఆ పంట పేరును నామకరణం చేయడం సంతోషదాయకమన్నారు. 2022-21 కొబ్బరి, 2021-22 సంవత్సరానికి చీని, నిమ్మ పరిశోధనలలో ముందడుగువేసి 2022-23 ఆర్థిక సంవత్సరానికి అరటి సంవత్సరంగా ఎంపిక చేయడం అభినందనీయం అన్నారు. వాతావరణం, వ్యాధులను తట్టుకునే విధంగా నాణ్యమైన పండ్ల దిగుబడులకు పరిశోధనలు చేసి అభివృద్ధి చేయడం శాస్త్రవేత్తల నిరంతర కృషికి ధన్యవాదాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలతో వ్యవసాయ రంగంలో కీలకమార్పులు చోటుచేసుకుని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యాన సహాయకులను నియమించారని, ఇప్పటివరకు ఉద్యాన సర్టిఫికేట్ పొందిన విద్యార్థులు ఖాళీగా లేరన్నారు. కోర్సు పూర్తిచేసిన ప్రతివ్యక్తికి ఉద్యోగం అందుతుందని, ఇంకనూ సచివాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. కోవిడ్ సమయంలో సి-విటమిన్ ప్రాధాన్యత తెలిసివచ్చిందని, చీని, నిమ్మ అభివృద్ధిలో గత 50 సంవత్సరాలుగా పని చేసిన వ్యక్తులకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో సాలీన 10.50 లక్షల హెక్టార్లలో 14 మిలియన్ టన్నుల చీని, నిమ్మ దిగుబడి ఉంటే మన రాష్ట్రంలో ఒక లక్ష్యా 40వేల హెక్టార్లలో 30లక్షల టన్నుల దిగుబడితో దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయ సావనీర్, రైతుల విజయగాథలు, స్వీట్ ఆరెంజ్, పులుపు నిమ్మ, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, ఉద్యానపంటల రైతుల ప్రశ్నలు, సమాధానాల పుస్తక ఆవిష్కరణలతో పాటు కొత్త వెరైటీ పోస్టర్, చీని, నిమ్మ పాటల సీడిలను ఆవిష్కరించారు. ఉద్యానపంటలలో ప్రతిభకనబరిచిన రైతులను పరిశోధనలో పాలు పంచుకున్న శాస్త్రవేత్తలను ప్రొపెసర్లను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సౌకర్యవంతంగా రైతుల భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సచివాలయాలకు అనుసంధానం చేసిందన్నారు. రైతులకు సబ్సీడికి ఎరువులు, విత్తనాలు అందజేయడంతో పాటు పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. రైతులు యూనిట్‌గా ఏర్పడి ఫుడ్‌ప్రాసెసింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఋణ సదుపాయం కల్పిస్తుందన్నారు. డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ స్క్రీన్ హౌస్ సందర్శించి బత్తాయిలో వైరస్ తెగుళ్ళు సోకని సయాను కొమ్మల ఉత్పత్తిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటల ఉత్పత్తి, మందుల వాడకం, పంటల ఉపయోగం, వివిధ రకాలతో తయారైన పంటల ప్రదర్శనలను, ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనల స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మొక్కలను నాటారు. ఉద్యోన పంటలలో పరిశోధనలు, మెళకువులు వంటి పలు పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ వైయస్సార్ ఉద్యాన యూనివర్శిటీ ఉప కులపతి టి.జానకిరామ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, పి.డి.ఏ.పి.ఎం.ఐ.పి. సతీష్, ఉద్యానశాస్త్రవేత్తలు మధుమతి, నాగరాజు, నారంనాయుడు, ముకుందలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు - చిత్తూరు బస్సు సర్వీసులు ప్రారంభం




ఆర్టీసి బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :

పుత్తూరు నుంచి చిత్తూరుకు వెళ్లే రెండు కొత్త ఆల్ట్రా పల్లె వెలుగు ఆర్టీసి బస్సులను గురువారం పట్టణంలో ఆర్టీసి డిపో ఆవరణలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎస్ 6 వాహనాలుగా పేర్కొనే ఈ బస్సులు తక్కువ కాలుష్యంతో నడుస్తాయని తెలిపారు. ఆర్టీసి అధికారులు ప్రయాణీకులకు సౌకర్యంగా వుండేలా పుత్తూరు నుంచి చిత్తూరుకు ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు నడుపుతున్నారని ప్రశంసించారు. డిపో మేనేజర్ ఎం.ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ గతం కంటే ఎక్కువగా 58 సీట్లతో, లోపల కొంచెం విశాలంగా ఈ ఆల్ట్రా బస్సులు ప్రయాణీకులకు సౌకర్యంగా వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసి ఆర్‌ఎం చెంగలరెడ్డి, ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, యూనియన్ నాయకులు, వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




తిరుపతి (విద్య), డిసెంబర్ 1, ప్రభాతవార్త

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి ప్రారంభించారు. ముందుగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజల్లో నైతిక విలువల్ని పెంపొందిస్తే ఇలాంటి వ్యాధుల భారిన పడాల్సిన దుస్థితి రాదన్నారు. హెచ్‌ఐవి సోకిన తర్వాత ప్రారంభంలో గుర్తించకుండా అలాగే దీర్ఘకాలం పాటు వదిలేస్తే అది ఎయిడ్స్ వ్యాధిగా రూపాంతరం చెందుతుందని తెలియజేసారు. డాక్టర్ వివేక్, మనోహర్‌లు మాట్లాడుతూ ముందుగా మానవత విలువలని పెంపొందించుకుంటే ఇలాంటి రోగాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. విశ్రాంత అధ్యాపకురాలు డా. మీనాకుమారి మాట్లాడుతూ హెచ్‌ఐవి చాలా సున్నితమైన వైరస్ ఇది మన రక్తంలో కాకుండా బయట ఏ మాత్రం జీవించలేదు భాగ్య వాతావరణంలోనికి వచ్చిన సెక్షన్లలోనే ఈ వైరస్ మరణిస్తుంది. అందుకే హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులతో కలిసి ఆహారం తిన్నా, వారిని తాకిన ఈ వైరస్ వ్యాప్తి చెందదని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధ్యాపకురాలు డా. స్నేహలత, డా. రాజేంద్రప్రసాద్, ఇతర అధ్యాపకులు విద్యార్థినులు ఎయిడ్స్‌ని అరికట్టే నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల మీదుగా మహిళా యూనివర్సిటీ వరకు నిర్వహించడం జరిగింది.

# 5న కర్నూలులో న్యాయగర్జన

## న్యాయరాజధాని ఏర్పాటుకు కంకణం కట్టుకొని ఉద్యమం

## జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, జిల్లా వైకాపా అధ్యక్షుల భరత్‌లు పిలుపు



చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ కర్నూలులో నిర్వహించనున్న న్యాయ గర్జనను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా వైకాపా అధ్యక్షులు, ఎమ్మెల్యే భరత్‌లు పిలుపునిచ్చారు. జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో గురువారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా వైకాపా అధ్యక్షులు, ఎమ్మెల్సీ భరత్‌లు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే మూడు రాజధానులు అవసరమని భావించి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకొన్నారన్నారు. మూడున్నర సంవత్సరాల పోరాటాలతో న్యాయ ప్రక్రియలో ప్రస్తుతం అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో డిసెంబర్ 5వ తేదీ జరుగనున్న న్యాయగర్జనకు రాయలసీమ జిల్లాల ప్రజానీకం సంపూర్ణ మద్దతు తెలపడానికి భారీ సంఖ్యలో హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజనతో కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రంకు తీరని అన్యాయం జరిగిందన్నారు. హైదరాబాదు నగరంను అభివృద్ధి చేయడానికి రాయలసీమ వాసులు తమ శక్తిని ధారపోశారన్నారు. మళ్ళీ తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడంతో ఉమ్మడి రాష్ట్రం నుండి మన రాష్ట్రం విడిపోయిందన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలైన కోస్తా, రాయలసీమ, అమరావతి ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి చేయడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కర్నూలులో ఈ నెల 5వ తేదీ అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగనున్న న్యాయ గర్జనకు జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు రాయలసీమ జిల్లాల్లోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాద సంఘాలు, ఉద్యోగ,కార్మికసంఘాలు, భారీ ఎత్తున ప్రజలు హాజరు కానున్నారన్నారు. కర్నూలును న్యాయ రాజధానిగా ఏర్పాటుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

# ముగ్గురు కార్మికులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి

నగరి, డిసెంబరు 1 ప్రభాతవార్త :

మండలంలోని మీరాసాహెబ్ పాలెం గ్రామ శివార్లలోని పగడాల ఫామ్స్‌లో బానిసలుగా వెట్టి చాకిరీ చేస్తున్న ముగ్గురు కార్మికులను విడిపించాలంటూ ఏకాంబరకుప్పానికి చెందిన జీవ జ్వాల సంస్థ ఇచ్చిన వినతిపత్రం మేరకు స్పందించిన ఆర్డిఒ సుజన, తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలన చేసి వెట్టి చాకిరీ నుంచి ముగ్గురు కార్మికులను గురువారం విడిపించారు. తహశీల్దారు తెలిపిన మేరకు... తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపాన మద్దూరు కొత్తూరు గ్రామానికి చెందిన గోవిందస్వామి (46), ఆయన భార్య గంగ (36), కుమార్తె అనిత (14)లు మీరా సాహెబ్ పాలెం సమీపంలో వున్న పగడాల ఫామ్స్‌లో పి.హనుమంతరావు అనే యజమాని వద్ద రూ. 80,000 వేలు అడ్వాన్స్ తీసుకుని పనిలో చేరారు. వీరందరికీ నెలకు రూ. 9,000 ఇస్తున్నట్టు యజమాని తెలిపారు. అయితే ప్రతి నెల ఇవ్వాల్సిన 9000 రూపాయల్లో అడ్వాన్స్‌గా ఇచ్చిన 80,000 వేలకు వడ్డీకి గాను రూ. 2,100 వేలు మినహాయించుకుని రూ. 6,900 వేలు మాత్రమే ఇస్తున్నాడు. ప్రస్తుతం అడ్వాన్స్‌గా ఇచ్చిన 80,000 వేలకు వడ్డీ కలిపి ఒక లక్ష రూపాయలు చెల్లించాలని యజమాని డిమాండ్ చేయడమే కాకుండా తాను పనిలో నుంచి తొలగించే వరకూ మరో చోటుకు పనికి వెళ్లకూడదని నిర్బంధించాడు. ఈ విషయం తెలుసుకున్న జీవ జ్వాల సంస్థ కార్మికులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించాలని ఆర్డిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఆర్డీఒ ఆదేశాల మేరకు తహశీల్దారు, ఎస్‌ఐ, కానిస్టేబుల్ సంబంధిత పగడాల ఫామ్స్‌కు వెళ్లి విచారించి కార్మికులను వదిలిపెట్టాలని ఆదేశించారు. దాంతో యజమాని వారిని అధికారులతో పంపించివేయగా, ఇక ఎక్కడికైనా వెళ్లి పని చేసుకోవచ్చని కార్మికులకు ఆర్డిఒ ఆదేశాలను అందించారు.



# గాడి తప్పిన పాలన

## శ్రీకాళస్తీశ్వరాలయంలో దళారుల దందాలతో గందరగోళం

## రెగ్యూలర్ ఐఓ నియామకంతోనే పరిపాలన కుదుట పడుతుందా!

**శ్రీకాళహస్తీశ్వరాలయ పాలన గాడితప్పుతుంది. ఇక్కడ పరిపాలనను చక్కదిద్దాలంటే రెగ్యూలర్ ఇఓ ఎంతో అవసరం.ఏటా సుమారు రూ.200 కోట్ల ఆదాయం గల ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి పెరుగుతుంది. ఇక్కడ రెగ్యూలర్ ఇఓను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

శ్రీకాళహస్తి,డిసెంబర్ 1 ప్రభాతవార్త

తిరుపతిజిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెగ్యూలర్ ఇఓను నియమించకుంటే పరిపాలన ఇంకా గాడి తప్పుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతుంది.సుమారు ఏడాదిగా ఇక్కడి ఆలయానికి తిరుపతి ఆర్‌జెసిని ఫుల్ అడిషనల్‌చార్జిగా బాధ్యతలు నిర్వహి స్తున్నారు. ఆయన 13జిల్లాల్లో దేవాదాయశాఖ కు సంబం ధించిన పరిశీలించాల్సి ఉంది. దాంతో ఆయన శ్రీకాళహ స్తీశ్వరాలయం పరిపాలన మీద పూర్తి స్థాయి దృష్టి సారించ లేకపో తున్నారు.ఇక్కడ గతంలో పని చేసిన ఇఓను వారి పేరెంట్ డిపార్టుమెంట్ రెవెన్యూ శాఖకు బదిలి చేసారు. దాంతో ఇక్కడ ఆలయానికి ఫుల్ అడిషనల్ చార్జి ఇఓగా తిరు పతి ఆర్‌జెసిని నియమించారు.

**ఆలయంలో గాడితప్పుతున్న పాలన:**

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలన గత ఆర్నెల్లుగా గాడితప్పుతుంది. ఇక్కడ రెగ్యూలర్ ఇఓ లేకపోవటంతో సిబ్బంది మొక్కుబడిగా పని చేస్తున్నారు. దళారుల ఇష్టారాజ్యంగా మారింది. ఇక నెలలో రెండుసార్లు అంతర్గత బదిలీలతో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారుతుంది. ఇక్కడ దళారులు రోజూ కనీసం రూ.4-5వేలు అక్రమ సంపాదనకు పాల్పడుతూ సంస్కరణలు అమలు జరగటం లేదు. ఒకప్పుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పరిపాలిస్తే నేడు ఆలయాన్ని దళారుల పాలన రెగ్యూలర్ ఉద్యోగులకు సవాలుగా మారింది. ఇక్కడి ఆలయంలో 'దళారులను నియంత్రించే శక్తి శివయ్య రెగ్యూలర్ ఉద్యోగులకు, అధికారులకు ఇవ్వలేదు.' ఎవరైనా దళారులను ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు.ఇక్కడ సమస్య దళారులు. వారికి అండ రాజకీయ నాయకులు. సమస్య వస్తున్నది దళారులతో.అయితే ఏదైనా జరిగితే రెగ్యూలర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బలి అవుతున్నారు. ఇందుకు ఉదాహరణ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారదపుష్కరిణిలో ఓ రాజకీయ పార్టీ జెండాలు కట్టారు.బ్యానర్లు ఏర్పాటు చేసారు. ఇక్కడ కార్యక్రమాలు ఏర్పాటుచేసుకున్నట్లు రాజకీయ పార్టీ ప్రకటించింది.కానీ ఎవ్వరూ స్పందించలేదు. తీరా ఈ అంశం వివాదాస్పందం కావటంతో ఓ సెక్యూరిటిని అక్కడ నుంచి పంపించి చేతులు దులుపుకున్నారు. సుమారు పది నెలల నుంచి ఇక్కడ ఫుల్ అడిషనల్‌చార్జి ఇఓ లేదు. పాలకులు ఎందుకో స్పందించటం లేదు. తిరుపతి ఆర్‌జెసినే రెగ్యూలర్‌గా నియమిస్తే ఆయన కఠిన చర్యలు తీసుకుంటారు.గతంలో ఇక్కడ పని చేసిన ఇఓనే కొనసాగించాలని పాలకులు భావించారు.కానీ ఎందుకో ఆ ప్రయత్నం ఫలించలేదు.



# నగర పాలక సంస్థ కార్యాలయం పాతభవనం కూల్చివేత పనులను ఎమ్మెల్యే భూమన పరిశీలన



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త

తిరుపతి నగర పాలక సంస్థ పాత భవనం గురు వారం కూల్చివేత పనులను ఎమ్మెల్యే భూమన, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ, తిరు పతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్ ఉద్దేశించి నేటి లోపల వాటర్ ట్యాంకును తొలగించాలని ఆదేశిం చారు. మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ కూల్చివేతను దగ్గరుండి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంఈ చంద్రశేఖర్, డిఈ దేవిక, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు

1/12/2022



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

## బంగారం ధరలు

1/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,955

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,203

## కోడిగ్రుడ్ల ధరలు

1/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# అభివృద్ధి పనులకు అధికారులు సహకరించండి

-ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ

పలమనేరు,డిసెంబరు 01,ప్రభాతవార్త: అభివృద్ధి పనులకు ప్రజప్రతినిధులతో పాటు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ పేర్కొన్నారు.స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు హాజరుకాగా వారితో మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారుల పాత్ర



కీలకమని తెలిపారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని అధికారులకు సూచించారు.ఈ మేరకు మండలంలో ఏనుగుల దాడులు నానాటికి అధికంగా ఉందని వాటి నివారణకు శాశ్వత పరిష్కారం కావాలని సర్పంచులు ఎమ్మెల్యేను కోరగా... ఇప్పటికే పరిష్కార మార్గాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రోజా,వైస్ఎంపిపి జయశ్రీ,జెడ్పిటిసి మల్లిక రంగనాథం, సర్పంచులు,తహసీల్దార్ కుప్పుస్వామి,ఎంపిడిఓ విద్యాసాగర్,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పక్కాగా సంక్షేమ పథకాలు అమలు

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ



చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో వార్డు కార్యదర్శులు, వార్డు వాలంటీర్ల సమన్వయంతో విధులు నిర్వర్తించి సమర్థవంతంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం 41వ డివిజన్ పరిధిలోని తోటపాళ్యం, నీవానది వీధి, బాణాల వీధిల్లో అధికారులతో కలిసి పర్యటించారు. 1వ తేదీ కావడంతో స్థానికంగా వాలంటీర్లు లబ్దిదారులకు అందిస్తున్న పెన్షన్లను ఈ సందర్భంగా కమీషనర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట



– సిహెచ్ఓ లక్ష్మీనారాయణ

యాదమరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి అడ్డుకట్ట వేయడా నికి ప్రజల్లో వ్యాధిపై విస్తృతంగా అవగా హన కల్పించాలని యాదమరి పిహెచ్సి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రపంచఎయిడ్స్ వ్యాధినిర్మూలన దినోత్స వం పురస్కరించుకొని మండల కేంద్రం యాదమరిలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, యాదమరి పిహెచ్సి సిబ్బంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ నిర్మలమ్మ, ఎంఎల్హెచ్పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పక్కాగా ఉపాధి పనులు గుర్తింపు

– డ్వామా ఎపిడి సుబ్రమణ్యం

పాలసముద్రం, డిసెంబర్ 1 ప్రభాతవార్త:



మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనులను పక్కాగా గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని డ్వామా ఎపిడి సుబ్రమణ్యం పేర్కొన్నారు. పాలసముద్రం పంచాయ తీ సచివాలయంలో గురువారం ఉపాధి పనుల గుర్తింపుపై ఎంపిడిఓ విద్యావతి, జడ్పిటిసీ అన్బుగలన్, వైస్ ఎంపిపి శేఖర్మండడి, సర్పంచ్ అయ్యప్పన్ల ఆధ్వర్యంలో ఉపాధి పనుల గుర్తింపు కోసం ఉపాధి సిబ్బంది, కూలీలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎడిపి సుబ్రమణ్యం మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులతో పాటు సామాజికంగా ప్రజలకు ఉపయోగపడే పనులను ఉపాధి పథకంలో గుర్తించి చేపట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడిఓ విద్యావతి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు అందుబాటులో వుండి వారికి ఉపాధి పనులు కల్పించడానికి ఎపిఓ చర్యలు తీసుకోవాలన్నారు.

## జిల్లా సిఐటియు మహాసభల కరపత్రాలు విడుదల

పూతలపట్టు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: చిత్తూరులో ఈ నెల 19, 20వ తేదీల్లో జరుగనున్న జిల్లా సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సిఐటియు నాయకులు సురేంద్రన్ పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తకోట ఆటో స్టాండ్ ఆవరణలో గురువారం జిల్లా సిఐటియు నాయకులు ఆటో డ్రైవర్లతో కలిసి జిల్లా సిఐటియు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కోత్తకోట ఆటో డ్రైవింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, శివ, నగేష్, రాధా, హేమ, బాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి - డాక్టర్ జయశంకర్.

పలమనేరు డిసెంబర్ 01 ప్రభాతవార్త :



ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొలమాసనపల్లి పిహెచ్సి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి జయశంకర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి నివారణ తప్ప చికిత్సలేదని అనవసరమైన వ్యామోహాలకు ఆకర్షితులు కాకుండా సుఖజీవనము గడపాలని సమాజ భాగస్వామ్యమే ఎయిడ్స్ పరిష్కారమని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత,సిహెచ్ఓ పద్మమ్మ,ఆరోగ్య సిబ్బంది జమున,రాధ,అంజలి,ఆశాలు జ్యోతి,అక్కి,భారతి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



బైరెడ్డిపల్లి డిసెంబర్ 01 ప్రభాతవార్త : బైరెడ్డిపల్లె మండలం తీర్థం పిహెచ్సిలో ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్స వం సందర్భంగా డాక్టర్ అరుణ్కుమార్, డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ విచ్చల విడి శృంగారం ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధికిగురి చేస్తుందని,సురక్షితమైన పద్దతు లు పాటటివంచకపోతే భార్యర్య కడుపులో బిడ్డకు సైతం ఎయిడ్స్ సోకుతుందని, స్టేరలైజ్ చేయని సిరంజిస్,సురక్షితం కాని రక్తమార్పిడి ద్వారా వ్యాధి వస్తుందన్నారు.

## వ్యవసాయసంస్కరణలతోనే రైతు అభివృద్ధి



పుంగనూరు,డిసెంబరు 1 ప్రభాతవార్త : రాష్ట్రంలోవ్యవసాయాభివృద్దికితీసుకుంటున్న సంస్క రణల ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తుల దిగు బడి, రైతుల సంక్షేమం వృద్ధిలోనికి వస్తున్నాయని ఎంపిపి భాస్కరరెడ్డి అన్నారు. గురువారం మండలానికి చెం దిన 17 మంది రైతులకు గడ్డికోత యంత్రాలను ఆయన పంపిణీచేశారు. మంత్రి పెద్దిరెడ్డి చొరవ తో గతంలో రైతులకు 32 యంత్రాలు పంపిణీచేశామన్నారు. రూ.33వేలు విలువచేసే యంత్రాలను రూ.20వేలకు అందచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి జ్ఞానప్రసన్నచంద్రారెడ్డి,ఇన్చార్జి ఎంపిడి ఓ రాజేశ్వరి,వ్యవసాయశాఖ ఏడిఇ శివ,మండల వ్యవసాయాధికారి కళ్యాణ్,పశువైద్యాధికారులు మనో హర్,అధికారులు సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీఎస్టీల సమస్యలపై తక్షణస్పందన

పుంగనూరు,డిసెంబరు 1 ప్రభాతవార్త : మండలంలోని ఎస్సీఎస్టీల సమస్యలపై రెవిన్యూ,మండల పరిషత్తు అధికారుల సమన్వయంతో తక్షణ పరిష్కారాలకు కృషి చేస్తామని కమిటీ ఛైర్మన్ అక్కిసాని భాస్కరరెడ్డి అన్నారు. గురువారం రెవిన్యూ కార్యాలయంలో జరిగిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల పరిధిలో ఉన్న ఎస్సీఎస్టీల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని అధికారులు వివరించారు. కమిటీ సభ్యులు రాజు,ఎన్ఆర్ అశోక్లు మాట్లాడుతూ సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. తహసీల్దార్ సీతారామన్,ఇన్చార్జి ఎంపిడిఓ రాజేశ్వరి,కమీషనర్ నర్సింహప్రసాద్లతో పాటూ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు మునేంద్రనాయక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణపై ర్యాలీ



పాలసముద్రం, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం పాలసముద్రం పిహెచ్సి సిబ్బంది పిహెచ్సి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులను ప్రేమ, ఆప్యాయలతో పలకరించాలని కోరారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షణ చూపకూడదన్నారు. ఎయిడ్స్ అనేది రోగం కాదనేది ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ ర్యాలీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్ఞానశేఖర్, పారా మెడికల్, ఐసిఐసి, నర్సింగ్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అబ్బురపరచిన గణిత అవధానం



చిత్తూరురూరల్, డిసెంబరు 1ప్రభాతవార్త: నగరంలోని బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్చేగణిత అష్టావధానం కార్యక్రమంను గురు వారం ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టరు శైలజాకుమారి మాట్లాడుతూ గణితంపై భయాన్ని పోగొట్టి పిల్లల్లో ఆసక్తిని పెంపొందించేందుకు గణిత అవధానం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం అవధాన ప్రక్రియలలో భాగంగా వారగణ, ఫన్ మ్యాథ్స్, గణాలు, పైవిలువలు, వింత చదరాలు, ప్రధాన సంఖ్యలతో భాగహారం, సంవత్సరంలోని 52వారాలు ఏఏ తేదీలలో వస్తాయి అనే విషయాలను పిల్లలకు అరుణ శివప్రసాద్ విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్యామల, పాఠశాల డైరెక్టరు ప్రియతేజ, సీనియర్ గణిత అధ్యాపకులు సాయిప్రసాద్కుమార్,గణితఉపాధ్యాయులుకిరణ్కుమారి, జ్యోత్స్న, రేవతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## ఐరాలలో ఘనంగా ఎయిడ్స్ ర్యాలీ



ఐరాల, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం ఐరాలలో గురువారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులచే అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఐరాల పురవీధుల్లో ఎయిడ్స్పై అవగాహనర్యాలీ నిర్వహించారు. అనం తరంస్థానికపీహెచ్సీ ఎదుట మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, వంశీ, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసులు, లతా, విజయ్కుమార్ మునిలక్ష్మీ, సురేంద్రనాయుడులతో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా ఎయిడ్స్ ర్యాలీ



తవణంపల్లె, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం తవణంపల్లెలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలోభారీర్యాలీనిర్వహించారు.మండల వైద్యాధికారి డాక్టర్ దత్తాత్రేయ చౌదరి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మండల వైద్యసిబ్బంది,స్థానికటి.పుత్తూరురోడ్డునుండిపాత పోలీస్స్టే షన్ వరకు గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాజశేఖర్, అమరావతి, సుబ్రమణ్యంరెడ్డి,ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

## పివికెయన్ విద్యార్థులచే ఎయిడ్స్పై అవగాహన ర్యాలీ

చిత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:



పట్టణంలోని పివికెయన్ ప్రభుత్వ కళాశాల విద్యా ర్థులు ఎన్ఎస్ఎస్, ఎన్సిసి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల నుంచి గిరింపేట, చౌడేశ్వరి అమ్మవారి జంక్షన్ వరకు ఎన్సి సి వాలంటీర్లు ఎయిడ్స్ నియంత్రణపై ప్లకార్డ్స్ చేతపట్టి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆనందరెడ్డి, ఎన్సిసి ప్రోగ్రాం ఆఫీసరు డా.భానుప్రకాష్, డా.బాబు, రామ్మూర్తి, ఎన్సిసి ఆఫీసర్ రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఎయిడ్స్దినోత్సవం

సదుం,డిసెంబరు1ప్రభాతవార్త



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని సదుంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చెరకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వ ర్యంలోను,సదుంప్రభుత్వ జూనియర్కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యా ర్థులఆధ్వర్యంలోనుపట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండులోమానవహారంఏర్పాటుచేశారు.వ్యాధి లక్షణాలు వివరించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కమ్యూనిటీవైద్యులుశ్రీధర్,పీహెచ్సీవైద్యులుగిరీషా,చరణ్,ఆరోగ్యపర్యవేక్షకసిబ్బంది ఉదయ్భాస్కర్, నీలకంఠ,భాగ్యలక్ష్మి, జానకి,ఐసీటీసీ కౌన్సిలర్ బాలాజీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి,ఎన్ఎస్ఎస్ పీఓ బాలస్వామి,లెక్చరర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## నైతిక విలువలతోనే విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి

డాక్టర్ ఎం.దేవరాజులు



పెద్దపంజాణి డిసెంబర్ 01 ప్రభాతవార్త : నైతిక విలువలతోనే విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని కవి,రచయిత,తెలుగుపండితులు డాక్టర్ మొరిమేకల దేవరాజులు పేర్కొన్నారు. మండలంలోని రాయలపేట ప్రభుత్వ ఎంపియుపీ ఉర్దూ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహి స్తున్న డాక్టర్ ఎం.దేవరాజులు సంపాదకత్వంలో ప్రభుత్వ ఉపాధ్యా యులచే ఇటీవలే రూపొందిన " ఉషా:కిరణాలు " అనే బాలకవితలు,గేయాలతో కూడిన పాఠ్య పుస్తకాన్ని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసారు.

# చిచ్చిలివారిపల్లెలో గడప గడపకు మనప్రభుత్వం

రొంపిచెర్ల, డిసెంబరు 1 ప్రభాతవార్త మండల పరిధిలోని చిచ్చిలివారిపల్లె గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్ర మంలో భాగంగా 522 ఇళ్లను సందర్శించి వారికి అందిన ప్రభుత్వ ఫలాలు గురించి వివరించారు. జగనన్న నవరత్నాలతోనే ప్రజల సమస్యలు తీరుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి,జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, మంత్రి పె



ద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఏ మునితుకారాం, వైఎస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ లక్ష్మీ, సింగిల్ విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు హేమలత, రుక్మిణమ్మ,ఇబ్రహీంఖాన్,సిరాజున్నీసా,జీవలత,నాగిరెడ్డి, అరుణమ్మ, సుధారాణి, ప్రసాద్నాయుడు,సుష్మా,అన్సర్భాషా, లక్ష్మీ, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్భాషా, ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దారు మురాషావలి తదితరులు పాల్గొన్నారు.

## మేకలు చోరీపై పోలీసులకు ఫిర్యాదు

గంగవరం, డిసెంబరు 1, ప్రభాతవార్త : మండలంలో ఓ రైతుకు చెందిన 15 మేకలు చోరీకి గురైనట్లు గురువారం బాధితుడు ఫిర్యాదు చేశాడు.బాధితుని ఫిర్యాదు మేరకు వివరాలిలా..మండలంలోని చౌడిరెడ్డిపల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన విటి శంకర్ అనే వ్యక్తి గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలంలో కోళ్ళఫారం షెడ్లు న్మించుకున్నాడు.ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి తన కోళ్ళఫారంలోని ఓ షెడ్లో ఉన్న కాశ్మీర్ జాతికి చెందిన 15 మేకలను గుర్తుతెలియని దుండగలు ఇనుప దోర్లను ద్వంసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## హౌసింగ్ పై సమీక్ష



వాకాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త వాకాడు మండలంలోని పేద బడుగు బలహీన వర్గా లు ప్రభుత్వ పక్కా గృహాలు వేగవంతంగా నిర్మించు కోవాలని వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ ఎంపిపి కార్యాలయంలోని వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రనిధిలు, స్థానిక నేతలతో హౌసింగ్ పై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని పేద బడుగు బలహీన వర్గాలకు 948 లే ఔట్లులో మొదటి విడతగా 391 గృహ నిర్మాణాలు నిర్మించుకునేందుకు మంజూరయ్యాయని తెలిపారు. పేదలకు లే అవుట్లో గృహాలు నిర్మించుటకు కాంట్రాక్ట్ పద్ధతిలో గాని, లబ్దిదారులు సొంతంగా గాని పక్కాగృహాలు నిర్మించుకోవచ్చు అని తెలిపారు. గృహాలు వేగవంతంగా నిర్మించుకోవాలని దామోదర్ రెడ్డి లబ్ధిదారులను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్తో పాటు తిరుపతి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులుగా నేదుమల్లి రాం కుమార్రెడ్డికి శుక్రవారం సాయంత్రం వాకాడుకు రానున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు మండల స్థాయి నేతలు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ గోపినాథ్, ఇన్చార్జి తహశీల్దార్ సారంగపాణి, జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ, వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, వాకాడు సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయ్ భాస్కర్ రెడ్డి, సర్పంచులు బండి వెంకట రత్నమ్మ, రౌతు శంకరమ్మ, అనిల్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, ఉపసర్పంచులు పాపా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటరత్నం, కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక నేతలు సుధాకర్ నాయుడు, దువ్వూరు మధుసూధన్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, రవికుమార్, వెంకటేశ్వర్లు రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కాంప్లెక్స్ పరిధిలోని జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ దాతృత్వంతో కొబ్బరిచెట్లు స్థానిక నేతలు నాటారు.

## ముందు జాగ్రత్తే మందు



కోట,డిసెంబర్ 1 ప్రభాతవార్త ఎయిడ్స్ నిర్మూలను ముందు జాగ్రత్తే అసలైన మందని ఎన్బీకేర్ సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాల ప్రిన్సిపల్ రామకృ ష్ణారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోవత్సవం సందర్భంగా మండలంలోని విద్యానగర్లోని ఎన్బీకేర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఒకింత సత్ఫలితాలు ఇచ్చినా వ్యాధి విస్తరణ ముప్పు ఇంకా పొంచి ఉందన్నారు. చాప కింది నీరులా వ్యాప్తిస్తుందన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యాన్ని చూపినా సరైన విధానాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయక పోయినా కేసులు సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధిని సమూలంగా అంతమొందించడమే అందరి లక్ష్యమన్నారు. బాధితులకు ఆత్మసైర్యాన్ని నింపేలా కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్,డాక్టర్, గాధి శ్రీనివాసులు, హరికృష్ణ కళాశాల కో-ఆర్డినేటర్ రాజష్, పిజికల్ డైరెక్టర్, ఉగ్గు ప్రతాప్,తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభివృద్ధి కోసం జగనన్న మరోసారి సిఎం కావాలి

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

వాకాడు, డిసెంబర్ 1, ప్రభాతవార్త రాష్ట్రంలోని పేదలు అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్న ముఖ్య మంత్రి కావాలని గూడూరు శాసనసభ్యులు వెలగపల్లి వరప్రసాదరావు మహిళలకు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం వాకాడు మండలం జమీన్ కొత్తపాలెం పంచాయితీ పరిధిలోని గంగన్నపాలెం, జెమిని కొత్తపాలెం గ్రామాలలోని ఎమ్మెల్యే పర్యటించి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే మరోసారి



రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను ఇప్పటికే పూర్తి చేశార న్నారు. బాలిరెడ్డి పాలెం స్వర్ణముఖి నదిలో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణా నికి తన వంతు కృషి చేస్తానన్నారు. తూపులపాలెం బంగాళా ఖాతంలో పూడికతీత పనులు త్వరలో జరుగుతాయని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని అధికారులుని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి, జడ్పిటిసి రౌత్ రామకృష్ణ మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరమణయ్య, ఎంపిడిఓగోపినాథ్, ఎస్ఐ రఘునాథ్, ఏపిఎం వెంకట్రావు, సర్పంచి పుల్లమ్మ, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు నందగోపాల్ రెడ్డి, కోటి రెడ్డి, తిరుమూరు భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కార్యకర్తలతో అధికారులు పాల్గొన్నారు.

## కేశవరంలో వైసిపి ప్రచారం

కోట,డిసెంబర్ 1 ప్రభాతవార్త కోట మండలం కేశవరంలో గురువారం తూర్పురాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి మద్దతుగా ఆయన అనుచరులు కోట మండల మాజీ జెడ్పిటీసీ సభ్యులు ఉప్పల ప్రసాద్గౌడ్ ప్రచారం నిర్వహించారు. ముందుగా సచివాలయంలోని ఉద్యోగులను, అక్కడ నుంచి ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి శ్యామ్ ప్రసాద్రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆయన కోరారు. శ్యామ్ ప్రసాద్ రెడ్డి ని గెలిపించుకొంటే ఈ ప్రాంతంలో ఏన్నో ఫ్యాక్టరీలు వస్తాయని, నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ఆయన వెంట గరుస్వామి,శ్రీరామ్ జ్యోతి, ముమ్మడి శ్రీనివాసులు, ఇరగరాజు, మనోహర్, కావలి చీరంజీవి, రాయపు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు

## దీవిసత్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ



దొరవారిసత్రం, డిసెంబర్ 1 ప్రభాతవార్త దొరవారిసత్రం మండల కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది ఎయిడ్స్ దినోత్సవము సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఎయిడ్స్ వ్యాధిని నిర్మాలిద్దాం భారతదేశాన్ని ఎయిడ్స్ రహితం చేద్దాం అంటు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది నినాదాలు పలికారు. వైద్యాధికారి చైతన్య సమీక్షంలో ఆరోగ్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వీరితోపాటు పలవురు వైద్యసిబ్బంది ఉన్నారు.

## అవగాహనే శ్రీరామరక్ష

కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త నిరక్షరాస్యత అవగాహనలేమి కారణం ఏదైతేనేం ఎయిడ్స్ బారినపడి ప్రాణాలు పోగొట్టుకున్నవారు కొందరైతే తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలైన వారు కూడాలేకపోలేదు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోట మండలం విద్యానగర్లోని ఎన్బికేఆర్ఐఎస్టిలో ఎన్.సి.సి,ఎస్ఎస్.ఎస్ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు.ఈర్యాలీని కళాశాలడైరెక్టర్,డాక్టర్.వి. విజయ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో హెచ్ఐవీ సోకిన వారి పట్ల కుటుంబ సభ్యులు,తెలిసిన వారు వివక్ష చూపించేవారని నేడు ఆ పరిస్థితిలో చాలా మార్పు వచ్చిందన్నారు. యువత, సమాజంలోని అన్ని వర్గాల వారికి హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అంతక ముందు ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్. ఉదయకుమార్రాజు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి ప్రారంభించారు. ఆయా కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్, చింతా రవీంద్రారెడ్డి, మాదవయ్య, పి.డి. మల్లిఖార్జున్ రెడ్డి, హరికృష్ణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కోటలో ఆక్రమణలు తొలగింపుపై గ్రామసభ

కోట,డిసెంబర్ 1 ప్రభాతవార్త కోట పట్టణంలో రోజు రోజుకు ఆర్అండ్బి రహదారులపై ఆక్రమణలు పెరుగుపోతున్నాయి. ఈ క్రమం లో ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటివల కోటలో ఆక్రమణలదారులపై గూడూ రు ఆర్డీఓ కిరణకుమార్కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో నేరుగా రంగంలోకి దిగిన ఆర్డీఓ కోట పరిస్థితిని చూసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఆక్రమణదారులకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు సైతంఅందచేశారు.ఈ క్రమంలో గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయాంలో అధికారులు గ్రామ సభ నిర్వహించిఆక్రమణలనుతొలగించాలనేతీర్మానంచేశారు. నోటీసులు అందుకున్న వారంతా వారంలోరోజుల్లో ఆక్రమణలను తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారుల స్పష్టం చేశారు.గ్రామ సభకు ఆర్అండ్బి అధికారులు డుమ్మాకొట్టారు. సమా వేశంలో తహిశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓమారెళ్లభవాని, పంచాయతీ కార్యదర్శి, శ్రీనివాసులు, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

– ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డిలు

యాదమరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డిలు పేర్కొన్నారు. యాదమరి మండలం మోర్దానపల్లిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జడ్పీ వైస్ ఛైర్మన్లు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్న లబ్దిదారుల వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సురేష్బాబు, తహసిల్దారు చిట్టిబాబు, ఎంపిడిఓ శివరాం, ఇఓపిఆర్డీ హరిప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ జయచంద్రా ఒడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బోధనోపకరణాలు వితరణ

విజయపురం, డిసెంబరు 1 ప్రభాతవార్త : మండలంలోని కొత్త ఇల్లత్తూరులో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు దొరస్వామి గురువారం విద్యా కమిటీ ఛైర్మన్ చెంచులక్ష్మి ద్వారా బోధన సామగ్రి పంపిణీ చేశారు. పేద విద్యార్థులను తమ వంతు ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని తెలపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మునస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూ రక్ష పత్రాలను త్వరితగతిన పంపిణి చేయాలి

**-వీడియో కాన్ఫరేన్స్‌లో సి.సి.ఎల్.ఏ స్పెషల్ ఛీఫ్ సెక్రటరి సాయిప్రసాద్**



తిరుపతిరూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్షా పత్రాలను పంపఇణిని త్వరితగతిన పూర్తి చేయాలని సి,సి.ఎల్.ఏ. చీఫ్ సెక్రటరి సాయిప్రసాద్ అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యచరణ అమలు తదితర అంశాలపై జిల్లా కల్టెర్లతో వీడియో కాన్ఫరేన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరేన్స్ హాలు నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ ఏ.డి.సర్వే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరేన్స్‌లో సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, కోర్టు కేసులలో పురోగతి తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ శాశ్వత జగనన్న భూ హక్కు-భూ రక్ష పత్రాల పంఫిణి కార్యక్రమాన్ని నిర్ధేశించిన గడువులోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. మ్యుటేషన్స్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 69 గ్రామాలకు సంబంధించిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పత్రాల పంఫిణి కార్యక్రమాన్ని పూర్తయిందని, రెండోవ దశకు సంబంధించి 96 గ్రామాలకు గాను భూరక్ష పత్రాల పంఫిణి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 28వ తేదీలోపు పూర్తి చేసేలా చూడాన్నారు. మ్యుటేషన్స్ కోసం అందిన ధరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. రీ సర్వేలో ప్రక్రియలో భాగంగా మొదటి దశలో మండలాల వారీగా లాప్‌టాప్‌లను పంఫిణి చేయడం జరిగిందని, రీ సర్వే రెండోవ దశలో భాగంగా నేడు కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ లాప్‌టాప్‌లను రీ సర్వే అధికారులకు అందజేసారు.

## తడలో ఘనంగా నిప్పో వ్యవస్థాపక దినోత్సవం




తడ, డిసెంబర్ 1 ప్రభాతవార్త: తడలోని నిప్పో పరిశ్రమంలో గురువారం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నిప్పో వ్యవస్థాపకులు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి 97వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. పరిశ్రమలో పనిచేసే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ఆందజేశారు. ముఖ్య అతిథిగా ఎస్.ఎస్.సంపత్ కుమార్, డైరెక్టర్ ఎం.శంకర్‌రెడ్డి, మోహన్ రామిరెడ్డి, సంతోష్ కుమార్, మురళీ మోహన్ రావు, మాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ



చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఈ నెల 7, 8 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభల గోడ పత్రికను గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్లను సత్వరం పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల నుండి భారీ ఎత్తున కార్మికులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసు, వినాయకలు, ఎఐటియుసి నాయకులు నాగరాజు, నాయకులు జయశంకర్, సురేష్, సుగుణ, శోభన్‌బాబు, పరదేశి, సుబ్రమణ్యం, చిత్ర, వినాయకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జగనన్న క్రీడా సంబరాల్లో పాల్గొన్న ఎంపి




తిరుపతి (క్రీడా), డిసెంబర్ 1, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, యువజన శాఖ నిర్వహణలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖల మంత్రి ఆర్కె రోజా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న క్రీడా సంబరాలు పేరుతో ఆటల పోటీలు నిర్వహిస్తున్న విషయం అందరికీ విధితమే. అందులో భాగంగా గురువారం తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో నిర్వహించిన ఈ సంబరాలలో తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. గూడూరు నియోజకవర్గం కోట పట్టణంలో అసంపూర్తిగా ఉన్న స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయాలనీ మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్ళి వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు మన దినచర్యలో క్రీడలు భాగం కావాలని ఆయన అన్నారు. ఒకసారి ఓడిపోయినా మళ్ళీ గెలువవచ్చు అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని అలాగే ఇంత పెద్ద ఎత్తున జగనన్న క్రీడా ఉత్సవాలు నిర్వహించడం హర్షనీయ మన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కృ తిక కళలను వెలికితీయడంలో మంత్రి రోజా తనదైన శైలిలో కార్యక్రమాలను చేపడుతున్నారని కొనియాడారు. మంత్రి రోజా మాట్లాడుతూ హిందువులు సంక్రాంతి, ముస్లింలు రంజాన్, క్రిస్టియన్స్ క్రిస్టమస్ జరుపుకొంటారు కానీ అందరూ కలిసి చేసుకునే పండుగ మన ముఖ్యమంత్రి జగనన్న పుట్టినరోజు అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, తిరుపతి నగర మేయర్ శిరీషా కలిసి వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# అభివృద్ధికి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి :ఎమ్మెల్యే



తిరుపతి డిసెంబర్ 1, ప్రభాతవార్త : తిరుపతి అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి నగరంలో 5,32,50 డివిజన్లలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి పూజలు నిర్వహించి ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి పనులను శరవేగంతో పూర్తి చేయడం జరుగుతున్నదని, తిరుపతి నగర పాలక సంస్థ త్వరితగతిన ప్రజాభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇంకనూ పూర్తి చేయాల్సిన పనులున్నింటిని దశల వారికి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ ప్రజలకి అవసరమైన పనులను గుర్తించి పూర్తి చేస్తున్నామన్నారు. గురువారం ప్రారంభించిన పనుల వివరాలను తెలియజేస్తూ 4వ వార్డులో 30 లక్షలతో సిసి కాలువలు, కనెక్టివిటీ రోడ్, 32వ వార్డులో 38 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, కాలువలు, 50వ వార్డు లెప్రసీ కాలనీలో 21 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్ రెడ్డి, తిరుత్తణి శైలజా, బోకం అనిల్ కుమార్, ఇతర కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆధం రాధాకృష్ణ రెడ్డి, రుద్రరాజు శ్రీదేవి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, దేవిక, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్, తలారి రాజేంద్ర, దేవదానం, దొరైరాజు, శ్యామల, పునీత, శాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగ నియామక ప్రక్రియపై అవగాహన

**- ఎస్పీ రిశాంత్‌రెడ్డి**

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో పోలీసు ఉద్యోగాలు సాధించడానికి ప్రయత్నించే అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీన చిత్తూరు సంతపేట ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంకు హాజరు కావడానికి ఆసక్తి వున్న అభ్యర్థులు 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పోలీస్ పిఆర్‌ఓ వాట్సావ్ నెంబర్ 9440900006కు పేరు, ఊరు, మొబైల్ నెంబర్‌ను పంపి నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేసుకొన్న అభ్యర్థులు 9వ తేదీ ఉదయం 9 గంటలకు ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగే అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుండి డిసెంబర్ 28, ఎస్ఐ పోస్టుల కోసం అభ్యర్థుల నుండి జనవరి 18 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో అభ్యర్థులకు ప్రాథమిక రాత పరీక్ష అనంతరం దేహధారుడ్య పరీక్షలు నిర్వహించి ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెయిన్స్ రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## లోక కళ్యాణార్థం అష్టాష్టక మహాభైరవ యాగం

**శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళి పీఠం "పీఠాధిపతి సూరి స్వామి"**



చంద్రగిరి, డిశంబర్ 1 ప్రభాతవార్త: లోక కళ్యాణమే పరమావధిగా అష్టాష్టక మహాభైరవ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళి పీఠం పీఠాధిపతి సూరి స్వామి తెలిపారు. తొండవాడ వద్ద గల శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళి పీఠంలో ఉదయం అమ్మవారికి, భైరవునికి అభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా హోమం విశిష్టతను సూరి స్వామి వివరిస్తూ మైసురపాకు శివలింగ ప్రతిష్ఠ, 64 మంది అష్టాష్టక భైరవులకు, బాల యోగిని దేవతలకు హోమం నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా జంతు పూజ (ఆవు, దూడ, అశ్వం, గజం, వృషభం, పాము,కుక్క) నిర్వహించడమైనడ న్నారు. తదుపరి పూర్ణాహుతి, నైవేద్య సమర్పణ, తీర్థప్రసాద వినియోగం గావించామన్నారు. సాయ ంత్రం శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళి సహస్రనామార్చన, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగంతో యాగం ముగిసిందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తడ, డిసెంబర్ 1 ప్రభాతవార్త: తడ మండలం కొండూరు పంచాయతీ పులివేంద్ర గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మగ్రి మస్తాన్ (55) మృతి చెందాడు. మోటారు బైక్‌పై పొలం వైపు వెళ్ళుతుండగా జాతీయ రహదారిపై వేగంగా పోతున్న లారీ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. తడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజల్లోకి పథకాలు ఎలా వెళ్తున్నాయనే విషయంపై పరిశీలన

**- డిగ్రీ కళాశాల విద్యార్థుల ఇన్‌టర్న్‌షిప్‌లో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి**

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న నవరత్నాలు ప్రజల్లోకి ఎలా వెళ్తున్నాయనే విషయంను కళాశాల విద్యార్థులు పరిశీలించాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌పై గురువారం జడ్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయంలో విద్యార్థులు జడ్పీ పరిపాలనా అధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం పథకాలు, నవరత్నాలను దిగ్విజయంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలు, నవరత్నాలు ప్రజల్లోకి ఎలా వెళ్తున్నాయనే విషయంపై క్షేత్ర స్థాయిలో విద్యార్థులు పరిశీలించి అవగాహన పెంచుకోవాలన్నారు. చిత్తూరు జిల్లా అభివృద్ధిపై సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కలెక్టర్ హరినారాయణన్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు సంబంధించిన 5 వేల మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జడ్పీకి వచ్చిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఏఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్ళ నిర్మాణం ఆలస్యంపై 9న నిరసన

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: చిత్తూరు పూనేపల్లి సమీపంలో జరుగుతున్న టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను సత్వరం పూర్తి చేసి లబ్దిదారులకు అందించకుంటే ఈ నెల 9వ తేదీ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ నాయకులు పేర్కొన్నారు. పూనేపల్లిలో జరుగుతున్న టిడ్కో ఇళ్ళ నిర్మాణాలను సిపిఐ ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్ధన్‌లు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ నిర్మాణాల్లో ఆలస్యం జరుగుతున్నందున పనులు వేగవంతం చేయాలని ఈ నెల 9వ తేదీ టిడ్కో లబ్దిదారులతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 10 లక్షల టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని చెప్పి ఇప్పటి వరకు నగరాలు, పట్టణాల్లో ఒక్క ఇంటి నిర్మాణం సైతం పూర్తి చేయాలని వారు ఆరోపించారు.డిసెంబర్ నెలాఖరులోపు ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగించకుంటే జనవరి నుండి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు విసి గోపినాథ్, మణి, సత్యమూర్తి, దాసరి చంద్ర, విజయగౌరి, రఘు, జమిలాబీ, మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ అడ్డుకట్టే లక్ష్యంగా విధులు

**- ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ ర్యాలీలో మేయర్ అముద**

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: సమాజంలో ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించి ఎయిడ్స్ రహిత సమాజ ఆవిర్భావానికి కృషి చేయాలని మేయర్ ఆముద పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి ప్రారంభమైన ర్యాలీని మేయర్ ఆముద జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్, ఆర్.చంద్రశేఖర్‌లు, అడిషనల్ డిఎంహెచ్ఓ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ మార్కెట్ చౌక్, చర్చివీధుల మీదుగా గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, వైద్యాధికారులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ గీత, డాక్టర్ రెడ్డప్ప, ఎస్వీ, అపోలో మెడికల్ కళాశాల నర్సింగ్ విద్యార్థినిలు, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చుతో మల్బరీ సాగుపై రైతులకు అవగాహన : కలెక్టర్



చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: జిల్లాలో మల్బరీ సాగును తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేలా రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ పట్టు పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ హరినారాయణన్ గురువారం పట్టు పరిశ్రమల శాఖ జెడి శోభారాణి, సహాయ సంచాలకులు హనుమంత్ నాయక్‌లతో జిల్లాలో పట్టు పరిశ్రమ సాగు, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 21 వేల మంది రైతులకు 37 వేల ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తున్నారని, వీరికి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన పరిజ్ఞానంను అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంను అందించడానికి రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం ద్వారా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలన్నారు. అలాగే న్యూప్లాంటేషన్, షెడ్స్ నిర్మాణం, పరికరాల కొనుగోలుపై ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను రైతులు సద్వినియోగం చేసుకొనేలా చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి శోభా రాణి కలెక్టర్‌కు వివరిస్తూ జిల్లాలో కుప్పం, పల మనేరు డివిజన్ల పరిధిలోని మండలాల్లో ఎక్కువగా మల్బరీ సాగు జరుగుతుందన్నారు. 2022-23 సంవత్సరంలో జిల్లాలో కొత్తగా 3 వేల ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింద న్నారు. ఇందులో భాగంగా నవంబర్ నాటికి 1,723 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా మల్బరీ సాగు జిల్లాలో చేపట్టడం జరిగిందని కలెక్టర్‌కు ఆమె వివరించారు. ఈ సమావేశంలో సెరికల్చర్ అధికారులు హనుమంత్‌నాయక్, కిషోర్ నాయక్, సీత, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గురుదక్షిణామూర్తికి విశేషాభిషేకాలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద గురువారం స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణలు జరిపారు.గురువారం దక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. స్వామి మూలవిరాట్టు వద్ద కలశ స్థాపన జరిపారు.స్థానిక సంప్రదాయం మేరకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్టుకు షోడషాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకాలంకారాలు జరిపారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. వేద మంత్రాలమధ్య స్వామి వారికి 108 పర్వత హారతులతోపాటు చక్రహారతి, కుంభహారతి, మహామంగళ హారతులిచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహాచరులు పాల్గొన్నారు.ఏర్పాట్లును ఆలయ ఇన్సెపెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు.

## గడపగడపలో ఎన్ని సమస్యలు తీర్చారు?

**-నేటి నుంచి ఇదేం ఖర్మ తిరుపతిలో మొదలు**



తిరుపతి,డిసెంబర్ 1 ప్రభాతవార్త: అధికార వైసిపి చేపట్టిన గడపగడప కార్యక్రమంలో తిరుపతిలో ఎన్ని సమస్యలు తీర్చారని ప్రజలకు చెప్పాలని టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యే, నాయకులు ఇంటింటికి తిరుగుతున్నా ప్రజల సమస్యలు ఎన్ని పరిష్కారం చేశారని అన్నారు. శుక్రవారం ఉదయం నుంచి తిరుపతిలో చేపట్టనున్న ఇదేం ఖర్మ తిరుపతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణ గురువారం ఉదయం సుగుణమ్మ ఇంట్లో జరిగింది. టిడిపి నాయకులు నరసింహయాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట శంకరనారాయణ, మహేష్‌యాదవ్ తదితరులతో కలసి ఇదేంఖర్మ పోస్టర్లను విడుదల చేశారు.

## 5న ఆలయంలో చొక్కాణి ఉత్సవం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనే ఉత్సవం చొక్కాణి. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న శ్రీకాళ హస్తీశ్వరాలయంలో కొన్ని సేవలు తమిళనాడును పోలి ఉంటాయి.శివయ్యను వివిధ రూపాల్లో ఆరాధించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో కృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామిని అగ్నితో పూజించే సంప్రదాయం ఉంది.ఈ ఏడాది చొక్కాణి ఉత్సవం ఈ నెల 5న మంగళవారం వచ్చింది. ఈ ఉత్సవానికి ఆలయ సిబ్బంది ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 5న అమ్మవారి ఆలయంలో హోమాలు నిర్వహించి హోమాలు ఏర్పాటు చేస్తారు. అలాగే 'బాల దీపాలు' వెలిగిస్తారు.ఈ దీపాలతో చొక్కాణి సందర్భంగా చెట్టును కాల్చుటకు ప్రదర్శనగా తీసుకురావటం ఆనవాయితి.

పెద్ద నంది ఎదురుగా ఏర్పాట్లు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే చొక్కాణిని ఆలయ ఆవరణలోని పెద్ద నంది విగ్రహం వద్ద ఏర్పాటు చేస్తారు.ఇందుకు ప్రత్యేకంగా తాటిమానును తెస్తారు.దానికి చుట్టూ తాటాకులను కట్టడం జరుగుతుంది. ఇందుకు తాటి మానును సిద్ధం చేస్తున్నారు.

## తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి సిద్ధం

**-నూతన ఆలయ నిర్మాణంపై సమీక్ష**

తిరుపతి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధంచేయడం జరిగిందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో మహాప్రాకారం నిర్మాణం జరుగుతుండటంతో ఆలయాన్ని పూర్తిస్థాయిలో విస్తరించి నూతన ఆలయం నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆలయం అభివృద్ధిపై టిటిడి వాటాగా 3.75 కోట్లు రూపాయలు మంజూరుచేసింది. ఈ నిధులతోబాటు దాతల సహకారంతో ఆలయాన్ని మరింతగా అందంగా నిర్మించనున్నారు. గురువారం నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష, గంగమ్మ ఆలయ ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఇఓ ఎం.మునికృష్ణయ్యతో కలసి ఎమ్మెల్యే భూమన సమీక్షించారు.

## నేడు జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి శుక్రవారం ఉదయం చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగే వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో పాల్గొంటారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమలు, ఇరిగేషన్, విద్యుత్, మార్కెటింగ్ శాఖలతో పాటు వ్యవసాయ అనుబంధ ఇతర శాఖల అధికారులతో వైస్ ఛైర్మన్ సమీక్షించనున్నారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, మండలాలకు చెందిన వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్లు హాజరు కానున్నారు.

## పగిలిన తెలుగు గంగ పైపులైను

**మరమ్మతులు చేయించిన సర్పంచ్ నాగేషం**



రేణిగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త: రోడ్లు బిల్డింగ్‌లు శాఖకు చెందిన జేసీబీ డ్రైవర్ నిర్వాకం వల్ల శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళుతున్న తెలుగు గంగ లైన్ గురువారం విరిగిపోయింది. నీళ్లు ఉవ్వెత్తున ఎగిసి ఆ ప్రాంతానంత జలమయం చేశాయి. విషయం తెలుసుకున్న రేణిగుంట సర్పంచ్ నాగేషం వాటర్ వర్క్ సిబ్బందితో సంఘటనా స్థలం పరిశీలించారు. వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ సుబ్బరాజు తమ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను చేపట్టి నీటి సమస్య లేకుండా చేశారు.

## మేడసానిని సత్కరించిన దేవస్థానం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలకు అతిధుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపధ్యంలో గురువారం టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మేడసాని మోహన్ విచ్చేసారు.ఆయన ఇక్కడి ఆలయం నిర్వహించే ధార్మిక,ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరౌతారు.అంతేకాక తెలుగుసంవత్సరాది సందర్భంగా నిర్వహించే కవిసమ్మేళనంను నిర్వహిస్తారు. ఇలా శ్రీకాళహస్తీశ్వరాలయంతో ఆయన అనుబంధం పెంచుకున్నారు.ఈ నేపధ్యంలో కవి, అవధాని, పండితులు డాక్టర్‌మేడసాని మోహన్ గురువారం జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితుల వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆయనకు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.